జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక

# విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఘనంగా శాస్త్రీయ నృత్య కార్యక్రమం..







పొన్నూరు జనవరి 5. జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో భారతీయ సంప్రదాయ కళలను విద్యార్థులకు చేరువ చేసే లక్ష్యంతో శాస్త్రీయ నృత్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పీ. నాగభూషణ్ సోమవారం తెలిపారు. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగం, డీన్‌స్టూడెంట్ అఫైర్స్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతిగాంచిన ప్రముఖ భరతనాట్య నృత్య కళాకారిణి డాక్టర్ బాలాదేవి చంద్రశేఖర్ ప్రత్యేక శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఇచ్చారు. భారతీయ శాస్త్రీయ నృత్యానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిన కళాకారిణిగా డాక్టర్ బాలాదేవి చంద్రశేఖర్‌కు విశేషమైన పేరు ఉందని వైస్ చాన్సలర్ పేర్కొన్నారు. భరతనాట్యంలో లోతైన సాధనతో పాటు, సంప్రదాయానికి ఆధునిక భావ ప్రకటనలను సమన్వయం చేస్తూ ఆమె చేసిన నృత్య ప్రయోగాలు కళారంగంలో విశేష ప్రశంసలు పొందాయని తెలిపారు.డాక్టర్ బాలాదేవి చంద్రశేఖర్ భారతదేశంతో పాటు అమెరికా, యూరప్, ఆసియా దేశాల్లోని అనేక ప్రతిష్ఠాత్మక వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇచ్చి భారతీయ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని పేర్కొన్నారు. ఆమె నృత్యాలలో అభినయం, లయ, భావం, కథనం సమన్వయంగా ప్రతిబింబిస్తాయని, శాస్త్రీయ నృత్యం కేవలం వినోద సాధన మాత్రమే కాకుండా భారతీయ తత్త్వచింతన, ఆధ్యాత్మిక భావనలకు ప్రతిరూపమని ఆమె ప్రదర్శనలు చాటి చెబుతాయని అన్నారు.ఈ శాస్త్రీయ నృత్య కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక అవగాహన, సృజనాత్మక ఆలోచన, కళల పట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యమని వైస్ చాన్సలర్ వివరించారు. భారతీయ కళలు, సంప్రదాయాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో కీలక పాత్ర పోషిస్తాయని, నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ2020) సూచించిన హోలిస్టిక్ ఎడ్యుకేషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఇలాంటి కళా కార్యక్రమాలు విద్యార్థుల్లో భావోద్వేగ బుద్ధి, సామాజిక బాధ్యత, మానవీయ విలువలు, భారతీయ సంస్కృతిపై గౌరవ భావనను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై శాస్త్రీయ నృత్య వైభవాన్ని తనివితీరా ఆస్వాదించారు.